

# తల్లిగుండె



## ముసునూరి పేరయ్యశాస్త్రి

**అందమైన** భవనం ముందు అనాథ శిశు దృశ్యం. అక్కడ జనం చాలామంది పోగయ్యారు! ఆ దృశ్యాన్ని కొందరు వేడుకగా చూస్తున్నారు. కొందరు జాలిగా చూస్తున్నారు. కొందరు అసహ్యించు కుంటున్నట్లు చూస్తున్నారు. అందరూ తలో విధంగా వ్యాఖ్యానిస్తూ నిలబడ్డారు. ఇంతలో ఆ ఇంటి యజమాని, ప్రముఖ దినపత్రికకు రిపోర్టర్‌గా ఉంటున్న రావుగారు వచ్చారు. జనం ఆయనకు దారి ఇచ్చారు. ఇంటి ముందు జనాన్ని చూసి కంగారు పడుతూ, ప్రహరీగోడ పక్కన రాళ్ళ మీద పడున్న ఆడశిశువును చూసి గతుక్కుమన్నారు.

"ఏమిటిది?" అని అడిగారు,

"ఏముందండీ, ఎవత్తో కని మీ ఇంటి ముందు పడేసింది." అన్నాడొకడు.

వెంటనే రావుగారు, "ముందు ఆ పాపను నీడకు చేర్చులిడి. ఎండ మండిపోతోంది" అన్నారు.

ఒకావిడ వచ్చి ఆ పాపను ఎత్తుకుని, రావుగారు ముందు దారి చూపించగా, దొడ్లో చెట్టు నీడన పడుకోబెట్టింది. రావుగారింకా ఆశ్చర్యంనుంచి తేరుకో నట్లు ఆ శిశువునే చూస్తూ నిలబడి పోయారు. అనేక వ్యాఖ్యానాలు ఆయన చెవిన పడుతూనే ఉన్నాయి. వాటిని వింటూ ఆ పాపను చూస్తూ నిలబడ్డారు.

"రావుగారూ! ఇంతకీ ఏం చేద్దామంటారూ?" అక్కడే ఉన్న రామారావు అడిగాడు. రావుగారికి బాగా కావలిసిన వాడు అతను.

రావుగారు "అదే ఆలోచిస్తున్నాను" అన్నారు.

ఆయన సమాధానం కోసం చాలా మంది ఎదురు చూస్తున్నారు. ఆ పేటలో పెద్దమనిషిగా మంచి మనిషిగా అందరూ ఆయన్ని గౌరవిస్తారు.

ఇంతలో రావుగారి భార్య వచ్చారు. ఆయన ఆమె వైపు చూశారు. పిల్లల్లేని బాధ ఆ క్షణంలో ఆమె కళ్ళల్లో మరింత స్పష్టంగా ఆయనకు కనిపిం చింది. వెంటనే తన ఆలోచనలకు రూపం కల్పిస్తూ "నేను ఆ పాపను పెంచుకుంటాను' అన్నారు.

ఆయన మాటలకి అక్కడకు చేరిన వారందరూ అవాక్కయి పోయారు. ఒకరి ముఖాలొకరు చూసు కుంటూ రావుగారి మంచి మనసును అభినందిస్తూ వెళ్ళిపోయారు.

రావుగారు ఆ పాపను చేతుల్లోకి తీసుకున్నారు. భార్య దగ్గరకు వెళ్ళి, "ఇది నా అభిప్రాయం. ఈపాప భగవంతుడు ఇచ్చిన ప్రసాదం. ఈజన్మ కిదే మనకు తృప్తి. మరి నీ అభిప్రాయం చెప్పు" అన్నారు.

ఆవిడ ఆనందంగా చేతులు ముందుకు చాపారు. ఆ పాపను ఆమె కందించారు.

"నువ్వు అంగీకరిస్తావనే ముందు నేనామాట అనేశాను". అన్నారాయన సంతోషంగా.

వెంటనే పనిమనిషి సహాయంతో పాపకు నీళ్ళు పోశారు. ఇంటిముంగిట ఉయ్యాల వేశారు. దానిని అందంగా అలంకరించారు. షాపు నుంచి పాల డబ్బాలను తెప్పించారు.

బయట అరుగు మీద రావుగారు, రామారావు కూర్చున్నారు.

రావుగారు కుర్చీలో బాసింపట్టు వేసుకు కూర్చుని ఆకాశంలోకి చూస్తూ ఆలోచిస్తూ, "రామూ! ఆ పిల్ల తల్లెవరు అయుంటుంది. నా ఇంటిమీద ఎందుకు వదిలి వెళ్ళిందో! ఎన్నిసమస్యలు ఉండకపోతే ఇలా కన్నబిడ్డను వదిలి వెళ్ళిందో! కడుపులో ఎన్ని నరాలు తెగిపోయాయో కన్నబిడ్డ నిలా వీధుల పాలు చేసేటప్పుడు" అన్నారు బాధగా.

రామారావు నవ్వి—"భలేవారే! ఇదేదో రహస్య

వ్యాపారం వల్ల భూమి మీద పడ్డ ప్రాణి. తెల్లారి లేస్తే ఎన్ని చూడటం లేదు. వీళ్ళు పొగరెక్కి ప్రవర్తించి, తరవాత చేసేది లేక ఇలా వదిలేస్తారు. అసలు ఇలాంటివారిని చీల్చి ఎండబెట్టాలి". అన్నాడు మాటల్లో కోపం ప్రకటిస్తూ.

రావుగారి ముఖం విషాదగ్రస్తంగా ఉంది. రామారావు మాటల్ని సమర్థించ లేకపోయాడు. కాసేపు కబుర్లు చెప్పి రామారావు వెళ్ళిపోయాడు. ఆయన మాత్రం అక్కడే కూర్చున్నారు. ఈ పిల్ల తల్లి ఎవరనే ఆయన మనసును వేధిస్తున్న ప్రశ్న. ఆమె ఎవరో, ఎందుకిలా చేసిందో తెలుసుకోవాలని ఆయనకి ఆత్రతగా ఉంది.

ఆమె ఎవరు? ఆమె ఎవరు?

ఎలా ఆమె ఉనికిని పసిగట్టడం?

ఎలా? ఎలా? ఎలా?

అలా చాలాసేపు ఆలోచించారు. చివరికి ఒక నిర్ణయానికి వచ్చారు. ఈ ప్రయత్నం వల్ల ఆ తల్లి ఎవరో బయట పడవచ్చునేమోనని ఆయన ఆశ.

రెండ్రోజుల తరవాత

రావుగారు తను తీసుకున్న పిల్లను వేలం పాట వేస్తున్నానని, పిల్లల్లేని వారు ఈ అవకాశం వినియోగించుకోవాలని ఆ పేటంతా ప్రచారం చేయించారు. ఈవార్త విని చాలామంది ముక్కున వేలేసుకున్నారు. ఎప్పుడు కనీ వినీ ఎరగని ఈ వేలం పాట గురించి కథలు కథలుగా చెప్పుకోసాగారు జనం. రావుగారిని కొందరు రహస్యంగా విమర్శిస్తున్నారు. కొందరు ముఖం మీదే విమర్శిస్తున్నారు. అయినా వాటి నేమీ పట్టించు కోకుండా ధైర్యంగానే నిలబడ గలుగుతున్నారు రావుగారు.

వేలం పాట వేసే రోజు రానే వచ్చింది.

రావుగారి ఇంటి ముందు చిన్న షామియానా వేయించారు. పందిరి మధ్య ఉయ్యాలలో పాపను పడుకోబెట్టారు.

వేలం పాట ప్రారంభం కావడానికి ముందే చాలామంది జనం వచ్చి చేరారు. అపూర్వమైన ఈ వేలం పాట ఎలా సాగుతుందో చూడాలనే ఉత్సాహం చాలా మందిలో కనిపిస్తోంది.

పందరూపాయల దగ్గర నుంచి వేలం పాట ప్రారంభమైంది. పిల్లల్లేని ముగ్గురు మాత్రమే వేలం పాటలో పాల్గొన్నారు. ఆ ముగ్గురు కూడా కలిగిన వారే. చివరికి పాట వెయ్యి రూపాయలదాకా సాగింది.

"సీతాపతిగారి పాట వెయ్యి." రామారావు గట్టిగా అరిచాడు. ఇంతలో లావుపాటి స్త్రీ జనాన్ని త్రోసుకొంటూ వచ్చి—"పన్నెండు వందలు" అంది.

అందరూ ఆమెవైపు చూశారు. రావుగారి దృష్టి కూడా ఆమెపైనే నిలిచింది.

రామారావు ఆమె పేరు అడిగి, "వరహాలమ్మగారి పాట పన్నెండు వందలు" అన్నాడు.

"పదిహేను వందలు!" సీతాపతి అన్నాడు.

"సీతాపతిగారి పాట పదిహేను వందలు."

"రెండు వేలు." వరహాలమ్మ అంది.

"వరహాలమ్మగారి పాట రెండు వేలు."

ఆ పైన ఎవరూ నోరు మెదపలేదు.

"వరహాలమ్మగారి పాట రెండు వేలు."

అయిదు నిమిషాలు గడిచాయి.

"ఒకటోసారి."

"రెండోసారి."

అంతే ...!

ఇంతలో ఒక యువతి జనాన్ని చీల్చుకుంటూ లోపలికి వచ్చింది. రావుగారి కాళ్ళను చుట్టేసుకుని ఏడ్వసాగింది. వూహించని ఈ సంఘటనకు రావుగారు మొదట అదిరిపడి, తర్వాత తేరుకొని, ఆ యువతిని లేవదీశారు. ఓదార్చి—"ఎవరమ్మా నీవూ?" అని అడిగారు.

ఆ యువతి దుఃఖాన్ని మింగి, "బాబుగారూ! ఈ వేలం పాట ఆపేయండి. మీ నీడలో అది పెరగాలని మీ ఇంటి ముందు వదలి వెళ్ళాను నేను బజారు మనిషిని. దరిద్రానికి, ఆకలికి తట్టుకో లేక శీలాన్ని అమ్ముకొని బ్రతుకుతున్న దాన్ని నా కూతురు నా లా కాకూడదనే ఆశతో ఈ పని చేశాను. ఇప్పుడు ఈ పిల్ల వరహాలమ్మ చేతిలోకి వెడితే దాని జీవితం కూడా అంధకార మవుతుంది. ఈ వరహాలమ్మ ఆడవారితో వ్యాపారంచేసే దుర్మార్గురాలు. దయచేసి నా పిల్లను రక్షించండి. మీ కిష్టం లేకపోతే దాన్ని చంపెయ్యండి. అంతేగాని ఈ వరహాలమ్మ చేతిలో పెట్టకండి" అంటూ ఆయన చేతుల్లో ముఖం పెట్టి గొల్లుమంది.

"అలాగే" అన్నారు రావుగారు.

"అదేం కుదరదు. పాట పెట్టాక ఆగడానికి వీల్లేదు. రెండు వేలు పాడింది నేను" అంది వరహాలమ్మ గాలిలో చేతులు వూపుతూ.

రావుగారు ఒక క్షణం ఆలోచించి, ఆ యువతి చెవిలో ఏదో చెప్పారు.

అప్పుడా యువతి ముందుకు వచ్చి, "నా పేరు పద్మ. నేను రెండు వేల అయిదు వందలకి పాడుతున్నాను" అంది.

"ఇరవై ఆరు వందలు." వరహాలమ్మ.

"ఇరవై ఎనిమిది వందలు." పద్మ.

"మూడువేలు." పంతం పెరిగింది వరహాలమ్మలో

"ముప్పై అయిదు వందలు." పద్మ.

వరహాలమ్మ తగ్గిపోయింది. పద్మ ముఖం మీద వేళ్ళు విరిచి వెళ్ళిపోయింది. పద్మ వెళ్ళి ఉయ్యాలలో ఉన్న కూతుర్ని ముద్దు పెట్టుకొని వచ్చి—"బాబయ్యగారూ! నమస్కారాలు. మీ మంచితనానికి నే నే మివ్వగలను. మీ నీడలో నా తల్లి సుఖపడుతుంది" అని వెళ్ళబోయింది.

"చూడమ్మా! నువ్వుమాత్రం ఎక్కడో ఎందుకు? గతాన్ని మరచిపోయి, నా దగ్గరే ఉండు. కన్న కూతురికి ఎన్నాళ్ళని దూరంగా ఉండగలవు?" అన్నారు.

పద్మ ధైర్యంగా—'ఎన్నాళ్ళయినా ఉండగలను, బాబుగారూ! నా నీడ దాని మీద పడకూడదు, నా ఉనికి దానికి తెలియకూడదు. ఒక అవకాశం మాత్రం ఇప్పించండి. అప్పుడప్పుడు వచ్చి చూసే అదృష్టం మాత్రం కల్పించండి." అంది.

"అలాగే నమ్మా, తప్పకుండా" అన్నారు రావుగారు.

పద్మ వెళ్ళిపోయింది. ఒకరిద్దరు తప్పించి మిగతా జనం వెళ్ళిపోయారు. తన ప్రయత్నం ఫలించడం వల్ల ఆయన మనస్సు తేలికపడింది. వెళ్ళి ఆప్యాయంగా పాప బుగ్గను ముద్దు పెట్టుకొన్నారు. ★

